# పోడు రైతుల జీవితాల్లో వెలుగులు



బతుకమ్మను నెత్తిన ఎత్తుకొని కార్యకర్తలతో కలిసి వస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

- పట్టాల పంపిణీ ఘనత సీఎం కేసీఆర్‌దే..
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- నర్సంపేట మండలం గులాబీమయం
- 15 గ్రామాల్లో ప్రచారం
- బతుకమ్మలతో స్వాగతం పలికిన మహిళలు
- మార్మోగిన జై తెలంగాణ నినాదాలు

నర్సంపేటరూరల్, నవంబర్ 5: ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని, గిరిజనుల పోడు భూములకు పట్టాలిచ్చిన బీఆర్‌ఎస్ సర్కారును ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగాపురం, ఇటుకాలపల్లి, ఆకులతండా, ఇప్పల్‌తండా, కొండసముద్రంతండా, ఏనుగల్‌తండా, ముత్యాలమ్మతండా, జంగాలపల్లితండా, గార్ల గడ్డతండా, రాజుపేట, ముత్తోజిపేట, రామవరం, రంగంపల్లి, లక్నేపల్లి, మగ్దిరనర్సయ్యపల్లిలో ఆదివారం పెద్ది ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగింది. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ, బోనాలు, కోలాటాలతో, పురుషులు డప్పుచప్పుళ్లతో ఎమ్మెల్యే పెద్దికి ఘన స్వాగతం పలికారు. జై తెలంగాణ నినాదాలు మార్మోగగా.. నర్సంపేట మండలం గులాబీమయమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంతో పోల్చితే నర్సంపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. మారుమూల గ్రామాలు, శివారు పల్లెలకు కూడా అభివృద్ధి రుచి చూపించామన్నారు. గడిచిన ఐదేళ్లలో స్థానికంగా ఉంటూ ఎన్ని అభివృద్ధి పనులు చేశానని, ఎన్నో సమస్యలు పరిష్కరించానని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఎమ్మెల్యే పెద్ది హెచ్చరించారు.

### అభివృద్ధికి అడ్డుపడుతున్న కాంగ్రెస్..

మాదన్నపేట పెద్ద చెరువులోకి గోదావరి జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంత రైతులు రెండు పంటలు సాగు చేసుకునేలా నీరు అందించానని పెద్ది అన్నారు. మాదన్నపేట పెద్ద చెరువు మినీట్యాంక్‌బండ్‌లో భాగంగా నిధులు తీసుకొస్తే.. కాంట్రాక్ట్ దక్కించుకున్న మాజీ ఎమ్మెల్యే మాధవరెడ్డి పనులు సరిగా చేయకుండా వదిలేశాడని విమర్శించారు. నర్సంపేటలో 36 కులాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు తీసుకొస్తే.. బుద్ధిలేని కాంగ్రెస్ నాయకులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతె కళావతి, జడ్పీటీసీ కోమాండ్ల జయ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ మోతె జయపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కొడారి రవన్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భూక్యా వీరన్న, క్లస్టర్ ఇన్‌చార్జీలు మచ్చిక నర్సయ్యగౌడ్, మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, కడారి కుమారస్వామి, తాళ్లపెల్లి రాంప్రసాద్, కట్ల సుదర్శన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మురాల మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు మండల రవీందర్, బానోత్ సుజాత, భూక్యా సైద, స్వాతి, దస్రూ, గోలి శ్రీనివాస్‌రెడ్డి, గొడిశాల రాంబాబుగౌడ్, ఎంపీటీసీలు ఉల్లేరావు రజిత, వీరూనాయక్ పాల్గొన్నారు.

### ప్రలోభాలకు తలవంచొద్దు..

నల్లబెల్లి: ఎవరు ప్రలోభ పెట్టినా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తలవంచొద్దని ఎమ్మెల్యే పెద్ది కోరారు. కొద్దిరోజులుగా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పలురకాల ప్రలోభాలకు గురి చేస్తూ విచ్చలవిడిగా మద్యం, డబ్బును ఎర చూపుతూ పార్టీ పిరాయింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆ పార్టీలో చేరిన తర్వాత కాంగ్రెస్ నాయకుల చిల్లర రాజకీయాలను తట్టుకోలేని తెలంగాణ ఉద్యమకారులు తిరిగి సొంతగూటికి చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు శనిగరం గ్రామానికి చెంగదిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఓరుగంటి రాజు పెద్ది సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్ చేరాడు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలెపు రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, మీడియా మండల ఇన్‌చార్జి అంబరగొండ రాజు, అశోక్‌గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్: ఇటుకాలపల్లిలో భారీ ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

## నేడు, రేపు మండలస్థాయి కళాఉత్సవ పోటీలు

హనుమకొండ సిటీ, నవంబర్ 5: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సోమ, మంగళవారం మండల స్థాయి కళాఉత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో ఎంపిక చేసిన విద్యార్థులను మండల, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. మండలస్థాయి పోటీలకు ఎంఈవోలు మండలానికి ఒక హెచ్‌ఎంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మండలస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 9, 10వ తేదీలో జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు గైడ్ టీచర్ సహాయంతో తర్ఫీదు పొంది ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. సంప్రదాయ గాత్ర సంగీతం, సంప్రదాయ జానపద గాత్ర సంగీతం, వాయిద్యాలకు సంబంధించిన సంగీతం, సంప్రదాయ నృత్యం, జానపద నృత్యం, విజువల్ ఆర్ట్స్ టు డైమెన్షనల్, విజువల్ ఆర్ట్స్ త్రీ డైమెన్షనల్, స్వదేశీ బొమ్మలు ఆటలకు సంబంధించిన కృతుల తయారీ, డ్రామా సోలో యాక్టింగ్ (ఏకపాత్రాభినయం), వంటే పది అంశాల్లో ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మిగితా వివరాలకు ప్రోగ్రాం ఇన్‌చార్జి ఏ మధుసూదన్‌రెడ్డిని 9849834110 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



రామప్ప ఆలయంలో హారతి తీసుకుంటున్న ఆస్ట్రేలియా దేశస్తులు

## రామప్పలో సండే సందడి

వెంకటాపూర్, నవంబర్ 5 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పూజరులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విన్నారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

### సందర్శించిన ఆస్ట్రేలియా దేశస్తులు

ఆదివారం రామప్పను ఆస్ట్రేలియా దేశస్తులు రాబిన్, మిచెల్, మెర్వ్, కెరీ, వెన్నో సందర్శించారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాముఖ్యతను గైడ్ ద్వారా తెలుసుకున్నారు. 800 సంవత్సరాల క్రితమే అద్భుతంగా టెంపుల్‌ని నిర్మించడం గ్రేట్ అని అన్నారు. అలాగే రామప్ప చెరువును సందర్శించారు.

## నేడు గ్రీవెన్స్ రద్దు

హనుమకొండ, నవంబర్ 5: కలెక్టరేట్‌లో మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నందున గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు వినతిపత్రం ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

## 'బొగత' వద్ద సండే సందడి

వాజేడు, నవంబర్ 5: ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చి బొగత అందాలను వీక్షించారు. తెలంగాణ నయాగరా అందాలను చూసి ఫిదా అయ్యారు. జలపాతం వద్ద స్నేహితులు, కుటుం బ సభ్యులతో కలిసి సెల్ఫీలు దిగారు. జలపాతంలో స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు.



బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి

# తెలంగాణకు వరంగల్ ఆధ్యాత్మిక రాజధాని

- కాకతీయ కట్టడాలకు ఎంతో ప్రాధాన్యం
- పిల్లలకు మన ఆచార వ్యవహారాలు తెలియజేయాలి
- శృంగేరి శారదాపీఠం ఆస్థాన పండితుడు, ప్రవచన నిధి బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి
- ఘనంగా బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం
- బీఆర్‌ఎస్ పశ్చిమ అభ్యర్థి దాస్యంకు ఆశీర్వాదం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వేద బ్రాహ్మణులు

హనుమకొండ, నవంబర్ 5: తెలంగాణ రాష్ట్రానికి వరంగల్ జిల్లా ఆధ్యాత్మిక రాజధాని అని శృంగేరి శారదాపీఠం ఆస్థాన పండితుడు, ప్రవచన నిధి బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి అన్నారు. హనుమకొండ శ్రీదేవి ఏషియన్‌మాల్ పక్కనున్న కీర్తశేషులు వెలపర్తి సుదర్శన్‌రావు ప్రాంగణంలో ఆదివారం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంతోష్‌కుమార్‌శాస్త్రి, విశిష్ట అతిథిగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, అతిథులుగా లలితాగాయిత్రీ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐనవోలు వెంకట సత్యమోహన్, స్కాలర్‌షిప్ కమిటీ చైర్మన్ డాక్టర్ అయితరాజు వెంకట నరసింహారావు, ప్రధాన కార్యదర్శి లకినపల్లి శ్యామ్ సుందర్‌రావు, కోశాధికారి వెంకటేశ్వర్‌రావు, పాలకుర్తి విజయలక్ష్మి, దేవులపల్లి వాణి, ఈటూరి కొండల్‌రావు హాజరయ్యారు. ఈ సమ్మేళనానికి ట్రైసిటీలోని 300 మంది బ్రాహ్మణ కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్‌శాస్త్రి మాట్లాడుతూ వ్యవహారికంగా రాష్ట్రానికి హైదరాబాద్ రాజధాని అయినప్పటికీ విద్యారణ్యుడు పుట్టిన గడ్డ, భాగవతం ఆంధ్రీకరించిన పోతన ఈ గడ్డపై పుట్టడం, ఎందరో మహాత్ములు తపస్సు చేసి ఈ నేలకు ఎంతో ప్రాధ్యానం తెచ్చిపెట్టారన్నారు. వరంగల్ పేరు విన్నా, ఈ ప్రాంతంలో అడుగుపెట్టినా ఒళ్లు పులకరించిపోతుందన్నారు. ఇక్కడి కాకతీయ తోరణాలు, కట్టడాలు, ఆలయాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని కొనియాడారు.

### నరజన్మ చాలా ఉత్కృష్టమైంది

బ్రాహ్మణుల గురించి మాట్లాడుతూ వేదంలో ఒక మంత్రాన్ని ఉటంకిస్తూ ఈ సృష్టిలో సర్వ ప్రాణుల్లో నరజన్మ చాలా ఉత్కృష్టమైనదని సంతోష్‌కుమార్‌శాస్త్రి అన్నారు. బ్రాహ్మణుడు తన అనుష్టానం తాను నిరంతరం కొనసాగిస్తూ ఎవరి వద్ద దేహి అని చేయి చాచాల్సిన అవసరం లేదన్నారు. నిత్యం సంధ్యావందనం, సహస్ర గాయత్రి చేసిన బ్రాహ్మణుడికి తాను కోరుకున్నది తన ముందు వచ్చి అభీష్ట సిద్ధి కలుగుతుందన్నారు. బ్రాహ్మణ కుటుంబాల్లో ఆచార వ్యవహారాలు తగ్గి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిలల్లకు మన ఆచార వ్యవహారాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ శ్రీ లలితా గాయత్రి బ్రాహ్మణ సేవా సహకార సంఘం దశమ వార్షికోత్సవం సందర్భంగా పేద బ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం అభినందనీయమన్నారు. తర్వాత 'లలితా భావ సమ్ముఖి' శ్రీలలితా గాయత్రి బ్రాహ్మణ సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో దశమ వార్షికోత్సవ సంచిక 2003–23 సావనీర్‌ను సంతోష్‌కుమార్‌శాస్త్రి ఆవిష్కరించారు. 28 మంది పేద బ్రాహ్మణ విద్యార్థులకు రూ. 2.50 లక్షల శ్రీలలితా గాయత్రి బ్రాహ్మణ సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో స్కాలర్‌షిపులు అందజేశారు. వరంగల్ పశ్చిమ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఈ సందర్భంగా ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఈటూరి కొండల్‌రావు, మధుసూదన్‌రావు, ఎం నాగేశ్వర్‌రావు, జీవీఎస్ శ్రీనివాసాచారి, జీ జియాప్రసాద్‌రావు, డాక్టర్ ఎన్‌వీఎన్‌చారి పాల్గొన్నారు.